
ఈ వారం తెలుగు పుస్తకం

# "సీమ కక్షల కథలు" - సామాజిక విధ్వంస ప్రతిఫలనాలు

సింగమనేని నారాయణ



Editor : NOOKAA RAM PRASADA REDDY
Subject: SHORT STORIES
Year of Publication: 2004
Pages: 264 : PAPER BACK
Price: US$ 2.31

నూకా రాంప్రసాద్ రెడ్డి సంకలనం చేసిన కథల సంపుటి ఇది. ముప్పయి మంది కథకులు రాసిన, ముప్పయి కథలిందులో ఉన్నాయి. సంకలనకర్త 'ముందుమాట'లో "సింగమనేని నారాయణ సంకలనం చేసిన "సీమ కథలు" సీమ రచయితల బాధ్యతను గుర్తు చేసింది... కొత్త కొత్త ఆలోచనల్నీ, సంఘర్షణల్నీ సంవేదనల్నీ ఆవిష్కరించింది! "మిత్రుజ్యోతి" సంస్థ ప్రకటించిన "సీమకవిత" ఆ బాధ్యతను మరింత పెంచింది! ఈ ప్రాంతంలోని "కక్షల కథల్ని" సంకలనంగా తేవటానికి ఆ రెండూ మార్గ దర్శకాలు" అని చెప్పకున్నారు. ఒక విధంగా ఇది "సీమకథలు"కు పొడిగింపుగా చెప్పకోవచ్చు.

ఈ సంకలనంలో ఉన్నవన్నీ రాయలసీయ కక్షలకు సంబంధించిన కథలు. ఇందులో కడప జిల్లాకు చెందిన కథలు పదునాలుగు, కర్నూలు జిల్లా కథలు ఆరు, అనంతపురం జిల్లా కథలు ఏడు, చిత్తూరు జిల్లా కథలు మూడు ఉన్నాయి. ఈ సంకలనంలోకి రాని కక్షల కథలు, మరికొన్ని కూడా లేకపోలేదు. "కక్షల కోణం నుండీ రాయలసీమను అధ్యయనం చేయటానికి, ఈ కథలు ఒక దిక్సూచి" అంటున్నారు సంకలనకర్త!.

వాస్తవానికి గ్రామకక్షలు అనేవి, రాయలసీమకే పరిమితమైనవి కావు. కక్షలూ, కార్పణ్యాలూ లేని పల్లెటూళ్లు దేశంలో ఎక్కడున్నాయి గనుక? అయితే రాయలసీమ ప్రాంతంలోని గ్రామకక్షలు, దేశంలోని ఇతర ప్రాంతాలలాంటివే అయినప్పటికీ, వీటికీ కొంతైనా ప్రత్యేకత ఉంది. అందువల్ల రాయలసీమ కక్షలను, అక్కడి చారిత్రక నేపథ్యం నుండీ, కరువు దుష్ఫలితాల నుండీ, అక్కడి ఫ్యూడల్ సంస్కృతి నుండీ విశ్లేషించుకోవాల్సి ఉంటుంది.

రాయలసీమ అంటే; కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలుగా మనం ఈనాడు పేర్కొంటున్నాము. వాస్తవానికి గతంలో, రాయలసీమ అంటే బళ్లారి, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలే. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత, బళ్లారి కర్ణాటకలో చేరగా, చిత్తూరును కలుపుకొని ఇప్పడు రాయలసీమగా వ్యవహరిస్తూ ఉన్నాము. 1760 ప్రాంతంలో, ఈస్టిండియా కంపెనీ కాలంలో 'కంపెనీ' పాలన కిందికి 'దత్తత' రూపంలో జమపడినాయి - ఈ జిల్లాలకు అప్పటి పేరు "దత్త మండలం". అనంతపురం కళాశాలకు గతంలో 'దత్తమండల కళాశాల' అనే పేరుండేది.

విజయనగరం సామ్రాజ్యం తిరుమల రాయల తర్వాత విచ్ఛిన్నం కాగా, ఆ తర్వాతి కాలంలో ముక్కలు ముక్కలై, అది ఎందరో పాలెగాళ్ల, అధీనంలోకి వచ్చింది. ఈ పాలెగాళ్లను తమ ప్రయోజనాలకు వాడుకున్నదీ, ప్రోత్సహించింది కూడా విజయనగర క్షీణయుగం నాటి పరిపాలకులే. ఈ పాలెగాళ్లతో క్రమంగా సొంత సైన్యాన్ని తయారు చేసుకొని స్వతంత్రులై, పొరుగు పాలెగాళ్లలో పోరాటాలు చేసుకుంటూ ఇక్కడి జీవన వ్యవస్థను ఛిన్నా భిన్నం చేసినారు. రాయలసీమకే ప్రత్యేకమైన పాలెగాళ్ల సంస్కృతి ఇది. "నిజాం ప్రభువు ఈస్టిండియా కంపెనీకి ఈ జిల్లాల్ని దత్తత ఇచ్చే కాలం నాటికే, ఈ ప్రాంతంలో సుమారు ఎనభైమంది, పాలెగాళ్లు ఉండేవారు. నిజానికి ఒక్క కర్నూలు జిల్లాలోనే, ఇరవైరెండు మంది పాలెగాళ్లను గుర్తించడం జరిగింది. 'సీడెడ్' జిల్లాలకు మొట్టమొదట, కలెక్టర్‌గా వచ్చిన 'సర్ థామస్ మన్రో', మొదట్లో ఈ పాలెగాళ్లను అణచ లేక పోయాడు. ఈ పాలెగాళ్లు కొత్తకొండ, కప్పర్తల, దేవరకొండ, ఆవుకు, కోయిలకుంట్ల ప్రాంతాల్లో, తమ ప్రధాన స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు- తమ సొంత సైన్యాలతో వాళ్లు మనుగడ సాగించేవారు. 1900 సంవత్సరం నుంచే కోయిలకుంట్ల తాలూకాలో ఫాక్షన్ ఉండేదని, రికార్డు చెబుతూంది - సర్ థామస్ మన్రో మెల్లగా తెలుగు నేర్చుకొని పరిపాలనలో తనకున్న మెలకువలన్నీ ఉపయోగించి క్రమంగా పాలెగాళ్లను నిర్దాక్షిణ్యంగా అణచి వేశాడు- అయినా ఈ ఫాక్షన్ భూతం రాయలసీమ జిల్లాల్లో తరతరాలుగా పుంజుకుంటూనే ఉంది (భూమన్- ఈ సంకలనం చివర వున్న వ్యాసం 'రాయలసీమలో ఫాక్షనిజం' నుండి).

ఈ చరిత్రనంతా ఇప్పుడు ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందంటే, అప్పటి పాలెగాళ్ల సొంతసైన్య సంస్కృతి, దాడుల సంస్కృతి, ఇప్పటి ముఠా కక్షల నాయకులకు ఒక వారసత్వంగా సంక్రమించిందని చెప్పటానికే. ఈ సంకలనంలోని కథల్లో కూడా, సొంత సైన్యం గల ఫాక్షనిస్టు నాయకులు మనకు కనిపిస్తారు. మారిన కాలానికి అనుగుణమైన ఆయుధాలు కలిగి వుండటం, ఇరవై ముప్పయ్యేసి వాహనాలలో, అనుచర గణంతో ప్రయాణాలు చెయ్యటం, ఎన్నికలను రణరంగంగా మార్చటం, కాంట్రాక్టులను మద్య వ్యాపారాలను తమ అధీనంలోకి తెచ్చుకోవటం, తమ సొంత సైన్యంతో కిరాయి హత్యలు చేయటం, ప్రత్యర్థులను వేటాడటం, ప్రభుత్వ పథకాలను స్వంతం చేసుకోవటం, ఊళ్లకు ఊళ్లను ధ్వంసం చేయించటం, ఆయుధాగారాలను కలిగి వుండటం, ఇలాంటివన్నీ గత సమీప చరిత్రలోని పాలెగాళ్ల సంస్కృతి నుండి సంక్రమించినవే. ఈ సంకలనంలోని కథల్లో కూడా ఈ సంస్కృతీ వాతావరణం మనకు కన్పిస్తుంది (గర్భస్రావం, నిచ్చెన, ఆయుధం, ఫిరంగిలో జ్వరం, మొ॥ కథల్లో ఆధునిక పాలెగాళ్లను చూడవచ్చు).

'గర్భస్రావం' (శాంతి నారాయణ కథల్లో శివారెడ్డి ఇంటిని ఆ ప్రాంతం వాళ్లంతా 'శివారెడ్డి సంస్థానం' అంటారు. అతని ఇల్లు ఒక కోటలా ఉంటుంది. చుట్టూ కాంపౌండ్ గోడ చైనా గోడను గుర్తు చేస్తూ వుంటుంది. తుపాకులు పట్టుకున్న మనుషుల మధ్య ఎవరెవరో నాయకులు వస్తూ పోతూ వుంటారు. అతడి సైన్యం ఎప్పుడు ఏ అలజడినైనా సృష్టించగలదు.

"నిచ్చెన" కథలో శంకరరెడ్డి ప్రభుత్వ పథకాలన్నింటినీ తన గుప్పెట వుంచుకుంటాడు- థియేటర్స్, వైన్స్, శ్లాబ్ పాలిషింగ్, నాపరాళ్ల క్వారాలాంటి ఎన్నో వ్యాపారాలకు అధిపతి. ఎన్నికల్లో తనకు అడ్డు అనుకుంటున్న ప్రత్యర్థులను అణచివేయగల అనుచరగణం కలవాడు.

'ఆయుధం' కథలో రాజన్నకు పెట్టని కోటలాంటి దళితసైన్యం ఉంటుంది. తన సైన్యంతో సునాయాసంగా ఎన్నికల్లో రిగ్గింగ్ చేయించగల దక్షుడు. ఎక్కడ బయలుదేరినా, ముందూ వెనుకా అనేక వాహనాలు నడవగా అరివీర భయంకరంగా ప్రయాణిస్తాడు.

'ఫిరంగిలో జ్వరం' కథలో వెంకటనాయుడూ, వీరారెడ్డీ ఎవరికి వాళ్లు తమంతటి శాత్రవులు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, సారా సామ్రాట్టుగా వెలుగుతున్న వాడు వెంకటనాయుడు. తనకు అడ్డు వచ్చిన సుగాలీల తాండాలను మట్టుబెట్టిన వాడు - బాంబుల ఆయుధాగారానికి అధిపతి.

వీళ్లంతా ఆధునిక పాలెగాళ్లు. గత చరిత్రలోని పాలెగాళ్ల సంస్కృతికి, ప్రతీకలుగా ఈ కథలో ప్రత్యక్షమవుతారు.

ఇదొక పార్శ్వమైతే, ఇక్కడ కరువులూ, వ్యవసాయ, సంక్షోభం, సాగునీటి కొరత కారణంగా ఏర్పడిన దుష్ఫలితాలు మరొక పార్శ్వం. ఇవి రాయలసీమను శతాబ్దాల తరబడి పట్టి పీడిస్తున్న జాడ్యాలు. 150 సంవత్సరాల కాలంలో 60కి పైగా కరువులను అనుభవించిన ఘనమైన చరిత్ర రాయలసీమకున్నది. "భారతదేశంలోని కరువుల చరిత్రే రాయలసీమ. రాయలసీమ చరిత్రే కరువు" అంటారు ఎం.వి.రమణరెడ్డిగారు "రాయలసీమ కన్నీటిగాథ"లో. ఇక్కడ వర్షపాతం అంతంత మాత్రం. అవీ అదునుకు పడి చావవు. ఇక సాగునీరంటారా? కోస్తా జిల్లాల్లో సాగవుతున్న 38.14 లక్షల హెక్టార్లకు గాను, 17 లక్షల హెక్టార్లకు (45 శాతం) భారీ నీటి ప్రాజెక్టుల ద్వారా, నీరందుతూంటే, రాయలసీమలోని 27.66 లక్షల హెక్టార్ల సాగుభూమికి గాను, 2.67 లక్షల హెక్టార్లకు మాత్రమే (10 శాతం) సాగునీరందుతూంది. అంటే రాయలసీమలో 90 శాతం సాగుకు వర్షమే ఆధారం. ఇక కరువు పిలిస్తే పలకకుండా ఎలా వుంటుంది? భారతదేశం మొత్తం మీద, అతి తక్కువ వర్షపాతం (530 మి.మీ) గల రెండవ జిల్లా ఇది. రాష్ట్రం మొత్తం మీద ఎక్కువ విస్తీర్ణంగల జిల్లా అయివుండి కూడా, అతి తక్కువగా, అంటే 8 శాతం కూడా సాగునీటికి నోచుకోని జిల్లా ఇది. గత నాలుగు సంవత్సరాలలో, దాదాపు నాలుగు వందల మందికి పైగా ఇక్కడి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నాలుగు లక్షల మందికి పైగా, ఈ జిల్లా నుండి రైతులూ, రైతుకూలీలూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినారు. -ఈ కరువు గాథ నంతా ఏకరువు పెట్టడంలో ఉద్దేశం, ఇక్కడి కరువుకూ, కక్షలకూ, సంబంధం వుందని చెప్పటానికే. కరువు వల్ల ప్రజలు ఉపాదిని కోల్పోతారు. చేయటానికి పనులు ఉండవు. ప్రజలు సోమరులౌతారు. పనులు లేక ఫాక్షనిస్టుల సొంతసైన్యంగా మారిపోతారు. నేర ప్రవృత్తిని అలవరచుకుంటారు. అందువల్ల ఇక్కడి కక్షలను పరిశీలించేటప్పుడు కరువును కూడా ఒక కారణంగా అధ్యయం చేయాల్సి వుంటుంది.

ఈ సంకలనంలోని చాలా కథల్లో ఫాక్షనిస్టుల అనుచర గుణంగా, సైన్యంగా, ఉంటున్న వారంతా పేదలే. తక్కువ కులాలకు చెందిన వాళ్లే. పనులు లేక, రకరకాల మార్గాలలో, ముఠానాయకుల చెంత చేరినవారే. వర్షాధారిత వ్యవసాయం కావటం వల్ల, సంవత్సరంలో ఏడు నెలలకు పైగా అసలే పనులు ఉండవు. భూగర్భజలాలు ఇంకిపోవటం వల్ల, అధిక శాతం పేద ప్రజలు వలసను ఒక మార్గంగా ఎన్నుకోగా, మరి కొంత మంది ఇదిగో ఇలాంటి నేరగాళ్లుగా మారిపోతారు.

ఇలాంటి వాళ్లను ఫాక్షనిస్టులకు మరింత సులభమౌతుంది. ముఠా కక్షల మధ్య జరిగే పోరులో అంతిమంగా బలి అయ్యేది కూడా ఇలాంటి వాళ్లే.

ఈ సంకలనంలోని చాలా కథల్లో ఈ సంగతి స్పష్టమవుతుంది. ఆర్థికంగానూ, కులపరంగానూ వెనుకబడిన వర్గాలు ఉపాది కోల్పోయి ఫాక్షనిస్టుల అండచేరి వారికి సైన్యంగా మారిపోతున్న వైనాన్ని, "నడక", 'ఆయుధం', 'చంద్రగ్రహణం', 'నెత్తురు మరకలు', 'నిచ్చెన', ఎలిగే పెద్దోళ్లు - నలిగే సన్నోళ్లు", "పడగనీడ"లాంటి అనేక కథల్లో చూడవచ్చు. ఈ అన్ని కథల్లోనూ, తమ నాయకుల ఆధిపత్య ప్రయోజనాలకు బలియవుతున్నది, ఇట్లాంటి దళిత వర్గాలే అన్న స్పృహ కలుగుతుంది.

"స్వామి" రాసిన 'నడక' కథ ఫాక్షనిస్టులకు సొంత సైన్యం, సమకురే విధానాన్ని వివరిస్తుంది... ఆ వూళ్లో బోయ కులానికి చెందిన మల్లయ్య పనీ పాటా లేని వాడు. ఉన్నా చేయటానికి వంగని సోమరి-వాడికి రోజూ పట్నం వెళ్లటం ఒక పని. అక్కడ సినిమాలు చూడవచ్చు. మట్కా ఆడవచ్చు. మందు కొట్టవచ్చు. మందు లేనిదే వాడికి పొద్దు గడవదు. ఇంట్లో భార్యను తన్ని డబ్బు లాక్కుంటాడు, తండ్రిని ఎదిరిస్తాడు - వాడికి రోజూ డబ్బు అవసరం ఉంటుంది. ఒక రోజు పట్నం వెళ్లిన వాడికి, సాయంత్రమయేసరికి మందుకోసం నోరు పీకుతుంది. వాడికి ఆ సాయంత్రం నేత్రపల్లికి చెందిన ఒక పాత పరిచయస్థుడు కన్పిస్తాడు నేత్రపల్లి మనిషిని గురించి, కథకుడి మాటల్లోనే చెప్పాలంటే, "...రాజకీయ నాయకులు సొంతసైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు - ఆ కిరాయి గూండాల గుంపుతోనే, ఎలక్షన్లలో రిగ్గింగ్ చేసుకుంటున్నారు - గవర్నమెంటు కాంట్రాక్టులూ, టెండర్ల కోసం, అదే ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపుతున్నారు.

ప్రభుత్వపు ఆస్తులను యథేచ్ఛగా అనుభవిస్తున్నారు. లక్షలూ, కోట్లూ సంపాదిస్తున్నారు. అట్లాంటి రాజకీయ నాయకుల కింద, ఒక నమ్మిన బంటుగా కుదురుకుంటే చాలు. ఇంక సమాజానికీ, ప్రభుత్వానికీ, భయపడే పని లేదనీ, పైగా తనే సమాజం మీద, ప్రభుత్వం మీదా, అధికారం చలాయించవచ్చుననీ ఆ నేత్రపల్లి మనిషి నేర్చుకున్న ఒక కొత్త జ్ఞానం"... అలాంటి జ్ఞానమొచ్చిన. ఆ నేత్రపల్లి మనిషి ఇప్పడు ఒక ఫాక్షనిస్టు రెడ్డికి అనుచరుడిగా ఉన్నాడు. అతడు మల్లయ్యకు మందు పోయిస్తాడు. "నువ్వుకూడా మారెడ్డి మనిషిగా కుదురుకో" అంటాడు "నీ అన్ని అవసరాలూ తీరుతాయి" అంటాడు. మల్లయ్యలాంటి వాడికి అంతకు మించి ఏం కావాలి? ఆ నేత్రపల్లి మనిషి వెంట నడుస్తాడు. ఇలాంటి మనుష్యులను సమకూర్చుకోవటంలోనే ఫాక్షనిస్టుల నైపుణ్యం ఉంటుంది. అలాంటి ఒక 'నడక'ను ఆ కథ ప్రదర్శిస్తుంది...

'ఆయుధం' (చిలుకూరి దేవపుత్ర) కథలో, జిల్లాలో పేరు మోసిన ఫాక్షనిస్టు 'రాజన్న'! అతడు కనుకున్న కొత్త సూత్రం, తానెప్పడూ తన కులం వాళ్లను నమ్ముకోకూడదు అని. తన కులం వాళ్లు ఆదేశాలిచ్చేందుకూ, ఆధిపత్యం చలాయించేందుకూ పనికి వచ్చే వాళ్లేగాని తనకు అవసరం వచ్చినపుడు, ఆయుధంగా ఉపయోగపడరని అతడు అనుభవం ద్వారా నేర్చుకున్న జ్ఞానం. తన్ను కాపాడగలిగే వారు, తన పనులను నెరవ్వేగలిగే వారూ 'దళితులే' అని అతని విశ్వాసం. అందుకే అతడు, తన తండ్రిలా కాకుండా, తన వూళ్లోనూ, చుట్టు పక్కలా వూళ్లోనూ వున్న, దళితుల్ని చేరదీసి తన సైన్యంగా మలచుకుంటాడు. తానెక్కడికి వెళ్లినా, వీళ్లు వెంట వుండాల్సిందే. తన అనూచరగణంలో. అతనికి అతి ముఖ్యుడు 'మల్లేసు' అనే దళితుడు. తాను ఎం.ఎల్.ఎ. కావటానికి రిగ్గింగ్ చేయించే నిపుణుడిగా, మల్లేసును రాజన్న మలచుకున్నాడు. తన నియోజక వర్గంలో రీపోలింగ్ జరిగినపుడు రిగ్గింగ్ ప్రధాన పాత్ర వహించి మల్లేసు, రాజన్నను గెలిపిస్తాడు కూడా! రాజన్నకు అతని తండ్రి తరం నుండీ కూడా, శివరామప్పతో ఫాక్షన్ ఉంది. ఈ ఫాక్షన్ సమరంలో, రాజన్న తండ్రి నారాయణప్పను, శివరామప్ప హత్య చేయిస్తాడు - దీనికి ప్రతీకారంగా, శివరామప్ప అన్నను ఈశ్వరప్పను బాంబులు వేసి చంపిస్తాడు రాజన్న. రాజన్నను చంపటానికి అప్పటి నుండీ శివరామప్ప వర్గం, ఎప్పడూ పొంచే వుంది. ఒకసారి రాజన్న తన అనుచరులతో కలిసి హైదరాబాదు వెళ్తుండగా, శివరామప్ప వర్గం, జడ్చర్ల దగ్గర దాడి చేస్తుంది. ఆ సమయంలో వెంటవున్న మల్లేసు, తన ప్రాణాన్ని ఒడ్డి రాజన్నను రక్షిస్తాడు... ఒకప్పడు మల్లేసు మిత్రుడు రమేష్, మల్లేసుతో, "ఒరే మల్లేసూ. మీ రాజన్న నూటికి నూరుపాళ్లు ఫాక్షనిస్టురా. ప్రాణం లేని తుపాకుల్నీ, బాంబుల్నీ నమ్మకుండా, మిమ్మల్నే ఆయుధాలుగా, రక్షణ కవచాలుగా చేసుకున్నాడు రా..." అని పలికిన పలుకుల్ని, నిజమని మల్లేసు నిరూపిస్తాడు. ఫాక్షనిస్టుల కోసం దళితులు బలి కావటాన్ని ఈ కథ నిరూపిస్తుంది.

విజయ సారథి రాసిన 'చంద్రగ్రహణం' అన్న కథలో కూడా దళితుల్ని ఫాక్షనిస్టులు ఉపయోగించుకున్న వైనం, కక్షల్లో దళితులే బలి అయ్యే పరిస్థితి, కన్పిస్తుంది. ఈ కథలో, నాగిరెడ్డి-రాఘవరెడ్డి, రాజకీయ ప్రత్యర్థులు. నాగిరెడ్డికి కుడి భుజం, మాలవాడకు నాయకుడైన నరసింహులు! నరసింహులుకు నాగిరెడ్డి అంటే గురి, విశ్వాసం. మాల వాళ్లమైన తమను గౌరవిస్తాడనీ, తమతో కలిసి భోంచేస్తాడనీ, తమ పనులు చేసిపెడతాడనీ గౌరవం. నరసింహులు, కొడుకు, 'చంద్ర' చదువుకుంటున్న యువకుడు. నాగిరెడ్డి దగ్గర బంటుతనం మానమని తండ్రికి నచ్చచెబుతాడు. తండ్రి వినడు. నాగిరెడ్డి రాజకీయాధిపత్యం, బలపడటానికి, నాగిరెడ్డి కోరిక మేరకు, నరసింహులు, రాఘవరెడ్డిని నడివీధిలో నరికివేస్తాడు. మరో వారానికల్లా, నరసింహులు కొడుకు చంద్రను రాఘవరెడ్డి వర్గీయులు హతమారుస్తారు. ఈ కథలో కూడా, అమాయకుడైన దళిత యువకుడు బలియైపోవటాన్ని చూస్తాము.

నిరుద్యోగులైన ఇద్దరు యువకులు, ఫాక్షనిస్టుల బాంబుల తయారీ పరిశ్రమలో కేవలం పర్యవేక్షకులుగా చేరిన పాపానికి, బాంబులు పేలి, మరణించిన ఘోరాన్ని, 'నెత్తురు మరకలు' కథలో (బత్తుల ప్రసాద్) చూడవచ్చు.

ఇనాయతుల్లా రాసిన 'నిచ్చెన' కథలో కూడా, ఫాక్షనిస్టు అనుచరుడిగా మారిన, పేదకులానికి చెందిన కిష్టిగాడు ఎన్కౌంటర్లో హతుడు కావటాన్ని గమనించవచ్చు. ఆ కథలో శంకర్రెడ్డి, సిద్ధారెడ్డి రాజకీయ కక్షదారులు. తన అనుచరుడైన కిష్టిగాడితో సిద్ధారెడ్డిని చంపిస్తాడు శంకరరెడ్డి. పని పూర్తయే వరకూ, సకల మర్యాదలతో చూసుకున్న

కిష్టిగాడిని, పని పూర్తికాగానే, గాలికి వదిలేస్తాడు. ఒక రోజు కిష్టిగాడిని పోలీసులు పట్టుకెళ్లి ఎస్.ఐ.కి. అప్పగిస్తారు. మరుసటి రోజు పేపర్లలో, కిరాయి హంతకుడు కిష్టిగాడు, 'ఎన్ కౌంటర్'లో పోలీసుల చేతుల్లో హతుడైనట్టు వార్త. శంకరరెడ్డే, పోలీసులతో కిష్టిగాడిని చంపించి వుండవచ్చుననే అనుమానం కూడా పాఠకులకు కలుగక పోదు. ఇలా వుంటాయి ఫాక్షనిస్టు అనుచరుల చావులు.

సరిగ్గా ఇలాంటికథే, జి. వెంకటకృష్ణ రాసిన 'పడగనీడ' కథ. పరిస్థితుల ప్రభావం వల్ల, ఆనందరెడ్డి అనుచరుడిగా మారిన దయాకర రాజు అనే యువకుడు, విధిలేని పరిస్థితుల్లో, ఆనందరెడ్డి ప్రత్యర్థిని బాంబులు పేల్చి చంపి వేస్తాడు. చివరికేమౌతుంది? కిరాయి హంతకుడిగా ముద్రపడి, పోలీసుల చేతుల్లో ఎన్‌కౌంటర్ పేరుతో హతుడైపోతాడు.

పి. రామకృష్ణారెడ్డి రాసిన "ఎలిగే పెద్దోళ్లు-నలిగే సన్నోళ్లు" కథ కూడా, ఇరువురి బలవంతుల ఆధిపత్య పోరులో చిక్కుకున్న దళిత కులాల ఘోషను వినిపిస్తుంది.

ఇలా ఈ సంకలనంలోని కథల్లో, ఎందరో పనీపాటు లేని పేద యువకులు, ఫాక్షనిస్టుల అండచేరి హతులై పోవటాన్ని గమనిస్తాము.

రాయలసీమ కక్షల సంస్కృతిని నిరాటంకంగా కొనసాగిస్తున్న మరొక కారణం, ఇక్కడి ఫ్యూడల్ మనస్తత్వం. భూమి కారణంగా సంక్రమించిన ఫ్యూడల్ సమాజం, ఆధునికతను సంతరించుకోనందున, వందలాది సంవత్సరాలుగా గిడసబారిన ఫ్యూడల్ తత్వం ఇప్పటికీ ఇక్కడ బలంగా ఉండటం. నాగరికతకు మూలాధారం నీళ్లు. నీళ్లు వుంటే వ్యవసాయం అభివృద్ధి అవుతుంది. పట్టణాలు పెరుతాయి. పరిశ్రమలు నెలకొంటాయి. పత్రికలు, రవాణా సౌకర్యాలు, విద్య విస్తృతమౌతాయి - వీటిని ఆశ్రయించుకొన్న, ఆధునిక భావజాలం కూడా ప్రజల మనస్సుల్లో చోటు చేసుకుంటుంది. ఈ అన్నిటికీ ఆధారం నీళ్లే. రాయలసీమలో లేనివి కూడా నీళ్లే. ఇందువల్ల వంద సంవత్సరాల క్రితం, ఏ ఉత్పత్తి సాధనాలు, ఏ ఉత్పత్తి పరికరాలు, ఏ ఉత్పత్తులు, ఇక్కడి మానవ సంబంధాలను ప్రభావితం చేసినాయో, ఇప్పటికీ అవే సంబంధాలు కొనసాగటం వల్ల, భూమిని ఆశ్రయించుకొని వున్న ఫ్యూడల్ అహంకారం వల్ల ఏర్పడిన, సామాజికమైన మొరటు ఆధిపత్య ధోరణలు, తమదే నెగ్గాలన్న మొండి పట్టుదలలు, అనవసరమైన పౌరుషాలూ పట్టింపులూ, ఇలాంటివన్నీ కూడా ఇక్కడి కక్షల సంస్కృతి నిరంతరం జ్వలించటానికి దోహదం చేస్తున్నాయి.

ఇలాంటి ఫ్యూడల్ ఆధిపత్య ధోరణుల కారణంగా, అనవసరంగా హెచ్చరిల్లిన ముఠాకక్షల సంస్కృతి కూడా, ఈ సంకలనంలోని కొన్ని కథల్లో ప్రదర్శితం కావటాన్ని చూడవచ్చు.

వై.సి.వి. రెడ్డి రాసిన 'ఐదురూపాయలు' కథలో బాలిరెడ్డి అనే భూస్వామి, ఒక కూలివానికి ఐదురూపాయల అప్ప ఇచ్చినాడు - కొన్ని రోజుల తర్వాత వాణ్ణి పనికి పిలిస్తే, వాడు "ముందు పిలిచినోళ్ల పనికి పోకుంటే వాళ్లు తంతారు" అని వేరే వాళ్ల పనికి వెళ్తాడు. ఈ తిరస్కారాన్ని బాలిరెడ్డి భూసామ్య అహంకారం సహించలేదు. తానిచ్చిన ఐదురూపాయల బాకీ నెపంతో, లచ్చిగాన్ని కట్టివేసి రోకటిబండతో బాదుతాడు. అంతే ఈ చిన్న సన్నివేశమే గ్రామంలో అణిగివున్న కక్షల్ని మండజేస్తుంది. ఆ వూళ్లో గంగిరెడ్డి బాలిరెడ్డి ప్రత్యర్థి. ఈ అవకాశాన్ని గంగిరెడ్డి వెంటనే ఉపయోగించుకుంటాడు. లచ్చిగాన్ని చేరదీసి బాలిరెడ్డిపై కేసు పెట్టిస్తాడు. ఈ కేసుతో గంగిరెడ్డి బాలిరెడ్డిల మధ్య వైరం పెరిగింది. నెల తిరిగే సరికి బాలిరెడ్డి గుంపులో ఎందుకూ పనికిరానివాణ్ణి గంగిరెడ్డి గుంపు నరికి వేస్తుంది. రోషాలు పెరుగుతాయి... గంగిరెడ్డి మీద బాలిరెడ్డి కేసులు పెడతాడు... ఇక పోలీసులూ, కోర్టులూ, వాయిదాలూ... చివరికెలా పరిణమిస్తుందో కథ చదివి తెలుసుకోవాల్సిందే. తనకు ఏ మాత్రం ఎదురు తిరిగినా, భరించలేని ఫ్యూడల్ అహంకారం, ఎలాంటి అనర్థాలకు దారితీస్తుందో ఈ కథలో చూడవచ్చు.

ఇలాంటిదే 'శనీస్సరుడు' కథ (వి.ఆర్.రాసాని). వీధిలో ఎవరి ఎద్దో వేసిన 'పేడ' కోసం, ఎదురెదురు కుటుంబాలలోని ఆడవాళ్లు పోట్లాడుకుంటారు. ఆ గొడవ పెరిగి మగవాళ్లు రంగంలోకి దిగుతారు. 'మమ్మల్ని ఎదిరిస్తారా?' అని ఈ వర్గం, "మాతోనే పోట్లాటలు పెట్టుకుంటారా?" ఎదుటి వర్గం, అహంకారాలతో విర్రవీగుతుంది. ఈ అహంకారాలు "కాచుకో"

అనే దాకా వస్తాయి. ఇది విస్తరించి 'ఖూనీ'ల దాకా నడుస్తుంది. చివరకు రెండు కుటుంబాలలోని వాళ్లంతా ఒకర్నొకరు నరుక్కుంటారు. రెండు కుటుంబాలూ సర్వనాశనమైతాయి. ఫ్యూడల్ ఆధిపత్య ధోరణలు ఎలాంటి అధఃపతనానికి దారి తీస్తాయో ఈ కథ వివరిస్తుంది. అహంకారాలు, పట్టుదలలు, పౌరుషాల కారణంగా చిన్న చిన్న గొడవలు, చిలికి చిలికి పెద్దవై కక్షలు పెంచి, మొత్తం కుటుంబాలకు కుటుంబాలే దగ్ధమైన సందర్భాలను ఈ కథలో చూడవచ్చు.

తమ మాట విననివాడు ఎవడైనాసరే, వాడి అంతు చూస్తామనే పొగరుబోతు తనానికి పేదలు బలి అవుతారు. "సిన్నమ్మా బతకలేను" కథలో (జి.ఆర్.మహర్షి), యాభై ఇళ్లు మాత్రమే వున్న ఆ చిన్న గ్రామంలో వున్న వాళ్లందరూ రెడ్లే. ఆ వూళ్లో 'రంగడు' చాకలి. ఆ రెడ్డి పనికి పోతే ఈ రెడ్డికి కోపం. ఈ రెడ్డి పనికి పోతే ఆ రెడ్డికి కోపం. పెద్దారెడ్డి, వెంకటరెడ్డి ఆవూళ్లో ప్రత్యర్థులు తమ అధికారమే సాగాలనే రకం. ఒక రోజు "బట్టలుతికి పోరా" అని పెద్దారెడ్డి, చాకలి రంగడిని పిలిస్తే, ఆ పని మీద బట్టలు తీసుకొని పోతున్న రంగడికి దారిలో వెంకటరెడ్డి ఎదురై, "అర్జంటుగా తాడిపత్రికి పోతున్నాను. వచ్చి బట్టలుతుకు", అని ఆదేశిస్తాడు. "ముందుగా పెద్దారెడ్డి పిలిచినాడు" అని రంగడు బదులు చెపుఆడు. అంతే వెంకటరెడ్డి ఇంతెత్తు ఎగిరి, బూతులన్నీ తిట్టి, "నా మాటంటే లెక్కాజమా లేకుండా పోయిందా! ఆ పెద్దారెడ్డి పోటు మొగోడా?" అని హుంకరించి, చెలకోల తీసుకొని రంగడిని, తిరిగినట్లల్లా కొడతాడు. అంతే. రంగడు వీళ్లకు భయపడి, ఊరే విడిచేస్తాడు - పట్నం చేరుకుంటాడు. ఇలా ఉంటాయి ఫ్యూడల్ ఆధిపత్య ధోరణులు. ఇలా చాలా కథల్లో ఫ్యూడల్ అహంకార విజృంభణల కారణంగా సంభవించే విధ్వంసాలను, కల్లోల గ్రామీణ వ్యవస్థనూ, కక్షల కుంపట్లనూ, ఈ సంకలనం దృశ్యీకరిస్తుంది.

రాయలసీమలో, గతంలో దాదాపు ఇరవై ఏళ్ల క్రితం వరకూ కూడా, 'ఫాక్షన్' అనే మాట వినిపించేది కాదు. 'పార్టీలు' అనే మాట వినబడేది. 'పార్టీలు' అంటే రాజకీయ పార్టీలు కాదు. ఒక ఊళ్లో రెండు కుటుంబాల మధ్య కక్షలు ఉంటే, ఆ కుటుంబాల మధ్య 'పార్టీ' వుంది అనేవారు. అలాంటి వూరును 'పార్టీల కొంప' అనేవారు అలాంటి ఊళ్లకు పిల్లనిచ్చేకి కూడా భయపడేవారు. ఈ పార్టీలు సాధాణంగా, అగ్రకులాల మధ్య ఉండేవి. రెడ్డీ, రెడ్డీకో, రెడ్డీ కమ్మకో, కమ్మకూ కమ్మతో, లేదా మరో బలమైన కులం మధ్యనో ఈ పార్టీలు ఏర్పాడేవి. ఇవి కొన్ని కుటుంబాల మధ్య వ్యక్తిగతమే అయినప్పటికీ, వూరు దాదాపు రెండు గ్రూపులుగా చీలిక తప్పని పరిస్థితి ఏర్పడేది. ఒక తరం కిందట వుండే ఇలాంటి పార్టీలు, వ్యక్తిగతమైన పరువు ప్రతిష్ఠల కోసమో, గ్రామాధిపత్యం కోసమో, పుట్టుకొచ్చి కక్షలకు దారి తీసేవి. ఈ కక్షల కారణంగా గొడవలూ, ఖూనీలూ, గృహ దహనాలూ, ఆస్తులపై దాడులూ జరిగేవి. కోర్టులూ, పోలీసులూ, కేసులూ జైళ్లూ, అనుచరులను మేపటాలూ, వీటితో ఇరువర్గాలకూ అపారమైన ఆర్థిక నష్టం సంభవించేది. చాలా చిన్న విషయాలతో ప్రారంభమైన ఈ కక్షలు, ఏళ్లు గడిచే కొద్దీ తీవ్రమై, ఒక తరంతో ఆగక, మరో తరం దాకా కూడా ప్రజ్వరిల్లేవి. కొన్ని కొన్ని చోట్ల రాజీ జరిగినా, అది ఎంతో కాలం నిల్చేది కాదు. దీనికంతా మూలం ఫ్యూడల్ ధోరణులే. సరైన విద్య లేక పోవటం, ఆధునిక జీవనశైలి గ్రామాల్లో అడుగుబెట్టక పోవటం, భూస్వామ్య కుల అహంకారానికి తోడు, పురుషాహంకారం, డబ్బు చేతుల్లో ఆడటం, స్వకీయ కులం అండదండలుండటం లాంటి ఎన్నెన్నో కారణాలు, ఈ 'పార్టీలు' ప్రబలటానికి దోహదం చేసినాయి - కాలం మారేకొద్దీ, రాజకీయాలు ఈ గ్రామ 'పార్టీ'ల్లోకి ప్రవేశించటంతో, వీటి పరిధి కూడా క్రమంగా విస్తృతి చెందింది. ఈ 'పార్టీ'ల నాయకులకు, రాజకీయ నాయకుల అండదండలు అవసరం కావటం, రాజకీయ నాయకులకు, ఎన్నికలలో ఓట్ల కోసం వీళ్ల అవసరం ఏర్పడటం, ఒక 'పార్టీదారు' ఒక రాజకీయ పక్షాన్ని ఆశ్రయిస్తే, ప్రత్యర్థి 'పార్టీదారు' ఎదుటి రాజకీయ పక్షం అండ చేరటం, వీటితో గ్రామకక్షల పరిధి, ఊరి పొలిమేరలు దాటి, జిల్లా రాజకీయల్లోకి అడుగు పెట్టటం, క్రమంగా జరిగిన ఒక పరిణామం. అది ఈనాటికి రాష్ట్ర రాజకీయాల దాకా విస్తరించటం మనం చూస్తేనే ఉన్నాము. క్రమంగా ఈ 'పార్టీ దారులే' రాజకీయాల్లోకి, ఎన్నికల్లోకి అడుగుబెట్టటంతో, రాజకీయాలు నేర రాజకీయాలుగా పరిణతి చెందటం ఆ తర్వాత జరిగిన మరో పరిణామం. ఈ దశలోనే "పార్టీ"ల స్థానంలో 'ఫాక్షన్' అన్న పదం చోటు చేసుకుంది.

ఏ రాజకీయ పార్టీ అధికారంలో వుంటే, ఆ పార్టీ తమ పార్టీ ఫాక్షనిస్టులకు అండ కల్పిస్తుంది. ప్రతిపక్ష పార్టీల ఫాక్షనిస్టులను వేటాడే వీలు కల్పిస్తుంది. ఈ దశకొచ్చే సరికి, పాతకాలంలో గ్రామాల్లో ఉన్న 'పార్టీలు' అన్న పదం పూర్తిగా అంతరించి పోయి, ఆధునికంగా ముచ్చటగా 'ఫాక్షన్', 'ఫాక్షనిస్టు' అనే మాటలు వాడుకలో స్థిరపడి పోయినాయి. 'పార్టీల' దశలో 'పార్టీదారులు' తమ అస్తిత్వం కోసం ఆస్తుల్నీ, సంపదల్నీ పోగొట్టుకోగా, 'ఫాక్షన్' దశలో ఆస్తుల్ని పెంచుకోవటం, కాంట్రాక్టుల పేరుతో వ్యాపారాల పేరుతో, పంచాయితీల పేరుతో, కోటీశ్వరులు కావటం విచిత్రంగా, అనతి కాలంలోనే జరిగిన ఒక రాజకీయ, సాంఘిక పరిణామం.

"ఒకప్పడు ఫాక్షనిస్టుల (పార్టీదారుల) ఆస్తులు ధ్వంసమయ్యేవి, పంటలు నాశనమయ్యేవి. పొలాలు బీడు పెట్టుకునేవారు... ఇవాళ దృశ్యం అది కాదు. ఇవాళ్ల వాళ్ల ఆస్తులు పెరిగినాయి. సంపదా, జులుం పెంచుకోవటానికి 'ఫాక్షనిజం' రెండువైపులా పదునున్న ఆయుధంగా మారింది", .... "పూర్వం ఫాక్షన్‌లో వుండే ఎవరైనా, తమ ఆస్తులు కరిగి, చివర్లో బికారీలుగా మిగిలేవారు. ఇప్పడున్న ఫాక్షనిస్టులు, రాజకీయాల్లో, సారా వ్యాపారాల్లో, సివిల్, అటవీ కాంట్రాక్టుల్లో దిగి, వాటిని తానొక్కడే హక్కు భుక్తం చేసుకుంటాడు (భూమన్-"రాయలసీమలో ఫాక్షనిజం").

ఈ సంకలనంలోని కథల్ని పరిశీలిస్తే, ఈ పరిణామాలు మనకు కొంతకు కొంతైనా, కనిపిస్తాయి.

కేతు విశ్వనాథరెడ్డి, 'కూలిన బురుజు' కథ, గ్రామాల్లో పార్టీలున్న కాలం నాటి దృశ్యాన్ని ముందుంచుతుంది... గవర్నమెంటు సారాయిని వేలంలో దక్కించుకున్న ఒక పార్టీ వాళ్లు, తమ అనుచరుణ్ణి, ఆ గ్రామంలో అమ్మకం దారుగా నియమిస్తే, మరో పార్టీ వాళ్లు కాపుసారా కాచి, వ్యాపారాన్ని అడ్డుకుంటారు. దాంతో గొడవలు ప్రారంభమౌతాయి. గవర్నమెంటు సారాయిని దక్కించుకున్న అమ్మకందారును "పదివేలిచ్చి కూలీనాకొడుకుల్తో చంపిస్తారు"... ఊర్లో తగాదాలు పెరిగి పోతాయి... పోలీసులు ఊళ్లో ప్రవేశిస్తారు. మగవాళ్లు, ఊరు విడిచి పరారీ అవుతారు... పుట్ట చెండ్లాట మాదిరి, నాటు బాంబుల్తో, ఆడుకున్న గ్రామపార్టీల ప్రపంచంలోకి అడుగు పెట్టిన కథకుడు "ఈ పల్లెటూళ్లు నాకు తెలిసినవే. ఈ గాలి ఒకప్పడు నేను పీల్చిందే ఈ నీళ్లు నేను తాగినవే. ఈ భూమిలో పండిన, జొన్నలూ, రాగులూ నేను తిన్నవే. ఈ మనుషులు నాకు సరిగా అర్థమయిన వాళ్లేనా?" అంటూ వాపోతాడు. వైసి.వి.రెడ్డి కథ "ఐదురూపాయలు" వి.ఆర్.రాసిని కథ "శనీస్వరుడు," 'పార్టీలున్న' గ్రామాలు ధ్వంసం అయిన తీరును చిత్రించిన కథలే.

ఇందులోని 'తడి' కథ (సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి) 'ఫాక్షన్' పెరగటానికి వీలున్న అంశాల్ని తడిమిన కథ. ఊళ్లో ఏర్పడే తగాదాలను, కక్షిదారులు తమ ప్రయోజనాలకు ఉపయోగించేకొనే తీరును కూడా చెప్పిన కథ. ఇద్దరన్నదమ్ముల మధ్య, "నీళ్లతడి" కోసం, అనవసరంగా పెరిగిన వైరం, వాళ్ల కుటుంబాల మధ్య ఎలాంటి చిచ్చును రగిలిస్తుందో ఈ కథలో చూడవచ్చు. పెరిగిన వైరాన్ని, ఆ వూరి పార్టీ దారులైన పెద్దిరెడ్డి, రామిరెడ్డి ఉపయోగించుకున్న తీరును ఈ కథ విప్పిచెబుతుంది. ఇరువర్గాలకూ కేసులు పెట్టించి, ఆ వూరి రైతు కుటుంబాన్ని రెండుగా చీల్చటానికి ప్రయత్నిస్తారు ఈ కథలో. ఈ కథ ఇంకా విస్తరిస్తే, ఆ వూరు రెండు కక్షల గ్రూపులుగా పరిణమించే అవకాశాన్ని ఈ కథ సూచిస్తుంది. అయితే కథకుడు కథను అంతదాకా నడపకుండా, ఆ అన్నదమ్ముల మధ్యగల వైరాన్ని, వాళ్ల తల్లులు ఆత్మీయతల తడితో ఆర్పివేస్తాడు... 'నీళ్ల' సమస్య ఈ కథకు మూలం.

భూమి సమస్య కారణంగా, ఏర్పడిన కక్షలను "దేవుని మాన్యం" (శ్రీనివాసమూర్తి) కథ చాలా వాస్తవికంగా, సహజంగా చిత్రిస్తుంది. దేవుని మాన్యం, రెండెకరాలను ఏళ్ల తరబడి గుట్టు చప్పడు కాకుండా, అనుభవిస్తున్న వాడు ఆ వూరి రెడ్డి, అంజిరెడ్డి. అది దేవుని మాన్యం అని కూడా ఎవరికీ తెలియనివ్వడు - ఎప్పడో నలబై ఏళ్ల క్రితం, ఆ వూరిలోని ఒక వైశ్య కుటుంబం, ఎక్కడో వున్న ఒక మఠానికి రాసి ఇచ్చిన భూమి అది. ఆ కుటుంబమూ ఇప్పడు ఆ వూరిలో లేదు - మఠానికి సంబంధించిన ఒక అధికారి ఆ వూరికి వచ్చి కూపీ లాగటంతో, ఇదంతా బయట పడుతుంది. ఈ కూపీకి సహకరించిన వాడు ఆ వూరి బ్రాహ్మణుడు. భూమి పోయిందన్న అక్కసుతో, పెంచుకున్న పగవల్ల, ఆ బ్రాహ్మణుని కొడుకు రామనాథాన్ని, అతని మిత్రుడు, శాంతిరెడ్డినీ, అంజిరెడ్డి హత్య చేయిస్తాడు... తర్వాత జరిగిన పరిణామాల్ని కథ పూర్తిగా చదివితే గాని

అర్థం చేసుకోలేము... భూమి సమస్య కేంద్రంగా సాగిన ఈ కథ, వర్తమాన నక్సలైట్ ఉద్యమాన్ని కూడా తనలో ఇమిడ్చుకోవటం ఈ కథకున్న మరో పార్శ్వం.

ఫాక్షనిజం, అమానుషమైన, సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థగా పరిణమించిన తీరు తెన్నుల్ని "సెప్టెంబర్ 11 అను ఫిరంగిలో జ్వరం" (సింగమమనేని నారాయణ) కథ దృశ్యమానం చేస్తుంది. ఈ కథను సెప్టెంబర్ 11 వ తేదీ, 2002 న సంవత్సరంలో అమెరికాలో ఉగ్రవాదుల దాడిలో ధ్వంసమైన, డబ్ల్యూ.టి.వో. టవర్ నేపథ్యంలో చదవాల్సి ఉంది.

ఈ కథను గురించి "తెలుగు కథకులు- కథన రీతులు 4" అన్న సంకలనంలో, బి. సూర్యసాగర్ చేసిన విశ్లేషణ ఇలా ఉంది...

"వెంకటనాయుడు, వీరారెడ్డి ఇరుగుపొరుగు వూర్ల భూస్వాములు-సారా కాంట్రాక్టుల కోసం, పోటా పోటీగా, తలపడుతూ, సైన్యాలను నిర్మించుకొని, సాధారణ ప్రజలను సమిధలను చేస్తూ, పరస్పర దాడులు సాగిస్తూ, ఫాక్షనిస్టు ముఠాలుగా రూపొంది, గ్రామీణ జీవితాన్ని అల్లకల్లోలం చేస్తారు. సారా రారాజుగా, రెండుసార్లు ఎమెల్యేగా, ఒక సారి మంత్రిగా, నియోజక వర్గానికి శాసనకర్తగా వెలిగినవాడు వెంకటనాయుడు - పదవులకు నామినేషన్లు, కాంట్రాక్టులకు టెండర్లు, తగాదాల పంచాయితీలు, ఎన్నికల రిగ్గింగ్, ఆయుధాల తయారీ పరిశ్రమ, అన్నీ అతడి అదుపాజ్ఞలలో ఉండాల్సిందే. శత్రు నిర్మూలన నిశ్శేషంగా జరగాల్సిందే. తండాల నాయకుడు గణేనాయక్‌ను ఉపయోగపెట్టుకొని వీరారెడ్డిని క్రమంగా బలహీన పరుస్తాడు. ఎన్టీఆర్ మద్య నిషేధం విధించగా, తన అధీనంలోని దొంగసారా కాచే తాండాల మీద, ఎక్సైజు వాళ్ల దాడులు తీవ్రం కావటంతో, రక్షణ కోసం, గణేనాయక్ నాయుడి పంచన చేరుతాడు. ఇద్దరూ సారా వాటాలు పంచుకుంటారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక, మద్యపాన నిషేదాన్ని పాక్షికంగా నడలించటంతో, నాయుడి వంటి సారా కాంట్రాక్టర్లు, బ్రాందీషాపుల వ్యాపారాలలోకి మారుతారు. వెంకటనాయుడి, బ్రాందీ వ్యాపారానికి, తన అనురుడే అయిన గణేనాయక్ దొంగసారా తయారీ ఆటంకమౌతుంది. నాయుడు, గణేనాయక్‌ల మధ్య మైత్రి తెచ్చిన 'సారా' ఇప్పుడు వైరం తెచ్చింది. నాయుడు, గణేనాయక్ తాండాలపై ఘోరమైన దాడులు జరిపిస్తాడు. ఈ పరిస్థితుల్లో నాయుడు చీనా తోటను, ట్రాక్టర్లను, రాత్రికి రాత్రే ధ్వంసం చేసేస్తాడు, గణేనాయక్. అది గణేనాయక్ పనే అని ప్రకటించి, అతని అంతానికి ప్రతిన బూనుతాడు వెంకటనాయుడు. ఎక్కడున్నా లొంగిపోవాలని, తాండాలు గణేనాయక్‌ను తనకు అప్పగించాలని, హెచ్చరిస్తాడు... తాండాలను తగుల బెట్టిస్తాడు. వీరారెడ్డీ, వెంకటనాయుడూ ఐక్యమవుతారు... వీళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం జిల్లా మొత్తం సంక్షోభంలో కూరుకుపోతుంది. గణేనాయక్‌పై వెంకటనాయుడి ప్రతిజ్ఞను, జార్జిబుష్ లాడెన్‌పై చేసిన ప్రతిజ్ఞను గుర్తుతెస్తుంది. 2002 సెప్టెంబర్ తర్వాత, బిన్ లాడెన్ కోసం అమెరికా సామ్రాజ్యవాదులు సాగించిన అన్వేషణను, ఆఫ్ఘనిస్తాన్ ఇరాక్‌లపై, అమెరికా కురిపించిన పాశవిక బాంబుల దాడులను, ఈ కథలో తాండాలను తగుల బెట్టడం లాంటి ఘటనలు గుర్తుతెస్తాయి - ఆధిపత్య రాజకీయాలు, కుగ్రామంలో అయినా, అంతర్జాతీయ స్థాయిలో అయినా, ఒకే రకంగా నడవటం ఈ కథ ద్వారా అవగతమవుతుంది. సమాజాల వ్యావసాయిక వెనుకబాటు తనం, సకల వెనుకబాటు తనాలకు, ఆధార భూమిగా ఉంటుంది. ఆ ఆధారం మీద, ఫాక్షనిస్టు రాజకీయాలు, ఒక ఆధిపత్య వ్యవస్థగా పరిణమించటాన్ని "ఫిరంగిలో జ్వరం" ఉద్వేగభరిత కథనంతో దృశ్యమానం చేసింది".

ఈ కక్షల సంస్కృతి నుండి దూరంగా, మనుషులూ, పల్లెలూ బతకాలనే సుందరమైన ఆకాంక్షతో, కథకులు రాసిన కథలు కూడా ఈ సంకలనంలో కన్పిస్తాయి. కక్షల కుటుంబాలకు పండుగలూ, పబ్బాలూ ఆహ్లాదంగా వుండవు. ఇంటి మనుషులతో కూడా, ఫాక్షనిస్టు కలుపుగోలు తనంగా జీవించలేడు. వసంతం లాంటి పండుగలు వస్తే ఊళ్లో వరసైన వారందరూ, వసంతాలు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూంటే, ఫాక్షనిస్టు కుటుంబం మాత్రం ఎవరినీ కలువలేని పరిస్థితి, వాళ్లనెవరూ కలుపుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. "నవ వసంతం" కథలో (తవ్వా ఓబులరెడ్డి) విజయరాఘవరెడ్డి ఫాక్షనిస్టు. అతని చాకలి వాడైన రామన్న, విజయ రాఘవరెడ్డి కూతురుతో "వానలో తడవని వాళ్లూ, వసంతంలో

మునగని వాళ్లూ దరిద్రులంట..." అంటాడు. ఆ మాటలు విన్న విజయ రాఘవరెడ్డిలో కలవరపాటు కలుగుతుంది. పొరపాటు ఎక్కడ జరిగిందో అర్థమవుతుంది. కొద్ది సేపటికి కుదుట పడి, తానూ వసంతం తీసుకుని చల్లటానికి పూనుకోవటం, ఈ కథలో అందమైన ముగింపు - కథకుడి ఆకాంక్ష ఈ రూపంలో వ్యక్తం కావటం పాఠకుడిని మురిపిస్తుంది.

పాలగిరి విశ్వప్రసాద్ రాసిన "చుక్క పొడిచింది" కథకూడా, కక్షలకు దూరంగా బతకాలంటే, ఊరు, విడిచి వెళ్లటమే పరిష్కారమని సూచిస్తుంది- ఈ కథలో సుజాత రవీంద్రారెడ్డి భార్య. రవీంద్రారెడ్డి కుటుంబం 'పార్టీల' కుటుంబం. ఆ ఇంటికి సుజాతను ఇవ్వటానికే ఇష్టపడరు. రవీంద్రరెడ్డి ఎమ్మెస్సీ చదువుకున్నాడని, పెళ్లయింతర్వాత ఉద్యోగిగా స్థిరపడతాడని, ఆ వూళ్లోనే ఉండడని నచ్చచెప్పి పెళ్లి జరిపిస్తారు. అయితే అనుకున్న విధంగా జరగలేదు. రవీంద్రారెడ్డి తండ్రిని, పంచాయితీ ఎన్నికల కక్షతో ప్రత్యర్థులుచంపివేస్తారు. అందుకు ప్రతిగా, రవీంద్రారెడ్డి తమ్ముడు, ప్రత్యర్థి కుటుంబంలో ఒకరిని నరికి వేస్తాడు. కేసులు నడుస్తాయి. రవీంద్రరెడ్డి వర్గం మీద ప్రత్యర్థులు పెట్టిన కేసును హైకోర్టు వర్గం కొట్టివేస్తుంది. రవీంద్రరెడ్డి నిర్భయంగా తిరిగే దశలో మళ్లీ ప్రత్యర్థి వర్గం మాటుగాసి, బాంబులు వేసి అతన్ని చంపివేస్తుంది. సుజాత భయంతో వణికి పోతుంది... ఆమెకు ఇద్దరు పిల్లలు. ఇక ఈ వూళ్లో ఉంటే, తన పిల్లలు కూడా పెరిగి పెద్దవారూ ఫాక్షనిస్టులుగా, మారిపోతారు. ఈ కక్షలకు దూరంగా బతకాలంటే తానీ వూరు విడిచి, పట్నంలో స్థిరపడి, పిల్లల్ని చదివించుకొని ఈ నీడ పడకుండా, పెంచాలని నిర్ణయించుకుంటుంది. అత్త, మరదులు వారించినా వినకుండా పిల్లలతో వూరు విడుస్తుంది సుజాత, ఈ కథలో "పగ తీర్చుకోవాల్సిన స్థానం నుండి పక్కకు తొలిగి, కొత్త జీవన పోరాటానికి సుజాత సిద్ధమౌతుంది" అన్న ఆకాంక్షతో కథ ముగుస్తుంది.

ఇలాంటి ఆకాంక్షల్ని వ్యక్తం చేసిన మరికొన్ని కథలు; "స్వేచ్ఛ" (ఎస్.వి.ప్రసాద్) 'ఊబి' (తుమ్మల రామకృష్ణ) 'కక్ష' (చెరువు అనంతకృష్ణ శర్మ) - ఈ కథల్లో కక్షల్ని వ్యతిరేకించే పాత్రలన్నీ, విద్యాధికులైన యువకులు కావటం గమనార్హం. కొత్తగా వస్తున్న చదువుకున్న తరం, ఈ కక్షల వల్ల రోసి పోయిందని ఈ కథలు చెబుతాయి. భయం నీడలో కాకుండా, స్వేచ్ఛా జీవితం జీవించాలనే ఆకాంక్షతో, పగవారికి గుడ్‌బై కొట్టి, ఊరికి దూరంగా వెళ్లటానికి సిద్ధపడతారు ఈ కథల్లోని యువకులు.

ఈ సంకలనంలోని "పరిష్కారం" (ఎం.వి.రమణారెడ్డి) కథ, "గాలివీడు నుండి న్యూయార్క్ దాకా" (మధురాంతకం రాజారాం) కథ, ఫాక్షన్ స్పర్శగల కథలే అయినప్పటికీ, ఒక రమణీయమైన ముగింపుతో నడచి, పాఠకుల పెదవులపై చిరుదరహాసాన్ని మొలకెత్తింప చేస్తాయి.

'పరిష్కారం' కథలో, సీతారామయ్యకు, పట్టణం మెయిన్ బజార్లో ఒక ఇల్లు ఉంటుంది. దాన్ని అతడు బాడుగకు ఇచ్చివుంటాడు. సీతారామయ్యకు ఒక కూతురు. ఆ ఇల్లు అమ్మితే తప్ప కూతురు పెళ్లి చేయలేని పరిస్థితి అతనిది. ఇల్లును ఖాళీ చేయిస్తే తప్ప, అమ్మకానికి పెట్టలేడు. అద్దె యజమాని ఇల్లు ఖాలీ చేయడు. ఆ ఇల్లు ఖాళీ చేస్తే అతని వ్యాపారం దెబ్బతింటుంది. సీతారామయ్య కోర్టులో దావా వేస్తాడు. అది తెగదు రెండేళ్లుగా సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సీతారామయ్యను, అతని మిత్రుడు రామదాసు, ఆ వూరి ఎమ్మెల్యే దగ్గరకు పిల్చుకుపోతాడు. ఎమ్మెల్యేకు ఐదు వేలు ముడుపు చెల్లించుకుంటారు. ఎమ్మెల్యే మనుషులు క్షణాల మీద ఆ షాపుపై దాడి చేసి, సరుకునంతా బజార్లో పడవేస్తారు. అడ్డువచ్చిన షాపు యజమాని మీద, అతడి కొడుకు మీద కూడా దాడి చేస్తారు. దాడి చేయించింది సీతారామయ్యే అని, పోలీసులు అతన్ని అరెస్టు చేస్తారు. సీతారామయ్య కూతురు రాజ్యలక్ష్మి ఈ సమస్యను తెలివిగా పరిష్కరిస్తుంది. ఆ అమ్మాయి నేరుగా అద్దె యజమాని ఇంటికి వెళ్తుంది. యజమాని కొడుకు ప్రతాప్‌తో మాట్లాడుతుంది. "ఇల్లు అమ్మతేగాని నాకు పెళ్లి కాదు. ఆ ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బు ఎవరికో ఇచ్చి పెళ్లి చేయడమెందుకు, ఆ ఇల్లు మీకే రాయిస్తే సరిపోదా" అంటుంది. ఆ యువకుడికి ఆమె భావం అర్థమవుతుంది. 'గొడవలన్నీ ఇంత సులభంగా పరిష్కారమైతే ఎంత బావుండు' అన్న ఆశాభావంతో కూడిన చిరుదరహాసాన్ని పాఠకుడి పెదాల మీద మొలకెత్తిస్తుంది ఈ కథ. ఈ సంకలనంలో 'తొలకరిజల్లు' లాంటిది ఈ కథ.

ఈ సంకలనానికి ఒక సాహిత్య ప్రయోజనం ఉంది. ఈ అనంతమైన కరువు సీమలో కక్షలు కూడానా? ఇవి తొలగి పోవాలని ఈ సంకలనం ఆశిస్తుంది. కక్షల వల్ల ఏర్పడే అశాంతి, అభద్రతా భావం, నెత్తురుమరకలు, తొలగి పోతే తప్ప, ఈ సీమ అభివృద్ధి సాధ్యం కాదు అన్న ఘోషను ఈ సంకలనం ధ్వనిస్తుంది.

ఫాక్షన్లవల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిన్నా భిన్నమై పోతుంది. వ్యవసాయం మూల పడుతుంది. ఒక గొడవో, ఒక హత్యో జరిగతే, వూళ్లో మగవాళ్లు పరారైపోతారు. వాళ్ల, పోలాల్లోని పంటకు దిక్కూ, మొక్కూ ఉండదు. పొలం పనులు ఎక్కడివక్కడ నిలిచి పోతాయి. కక్షి దారులు పొలాలను విధ్వంసం చేస్తారు. చెట్లను నరికి వేస్తారు. కరెంటింజన్లు పేల్చి వేస్తారు. ఇళ్లలో ఆడవాళ్లు బిక్క బిక్కు మంటూ భయంతో కాలం గడుపుతారు. కూలీ నాలీ జనం, పేద కులాల వాళ్లు, ఊరు విడిచి వలసలు పోతారు. పాక్షన్ కొంపల్లో మృత్యనీడలు ముసురుకుంటాయి. "ఒక వైపు పిలిస్తే పలికే కరువులు. మరొక దిక్కు కూలి పోతున్న సంసారాలు. గూనికి తోడు దొబ్బుడు వాయువన్నట్టు ఈ గ్రామ కక్షలు. ఇక్కడి భవిష్యత్తేమిటి? అంటూ అంగలారుస్తుంది 'కూలిన బురుజు'లో కథకుడి పాత్ర. ఈ కక్షల వల్ల కోర్టులూ, కేసులూ, లాయర్లూ, పోలీసులూ, జైళ్లూ, ఖర్చులూ వీటికి కొదవే వుండదు. ఈ అన్నింటితో గ్రామీణ వ్యవస్థ తన సహజమైన రూపురేఖలన్నింటినీ కోల్పోతుంది. "మానవ నాగరికతలో వేల ఏళ్ల పాటు, కొన్ని కోట్ల చేతులు శ్రమ చేసి సాధించిన అపూర్వ నైపుణ్యం వ్యవసాయం. ఇప్పడది వూర్లో యింకి మూలకు పడబోతున్నది. ప్రాణాలు కోల్పోయి, కొంతమంది, హత్యలు చేసి కొంతమంది, సేద్యానికి దూరమై చేలు బీడు పడ్డాయి" "ప్రతిరైతూ, శరీరభాగాల లాగా చూసుకున్న చక్రం, నాగలి, గుంటక, మొత్తం సేద్యపు పనిముట్లు, శవాలతో పాటే పట పటమని కాలి మంటలు పైకెగుస్తున్నాయి" (దేవుని మాన్యం) అంటూ ఈ సంకలనంలో కథకులు విలపిస్తారు.

దేశంలోని పాలక పక్షాలనూ, రాజకీయ నాయకులనూ, మేధావులనూ, ప్రజాతంత్ర వాదులనూ, "ఈ సీమ గురించి ఆలోచించండి- ఈ కక్షల కష్టాన్ని ఆర్పటానికి ప్రయత్నించండి" అన్న ధ్వనుల ప్రకంపనల్ని పాఠకుల గుండెలు తాకేలా చేస్తుంది ఈ సంకలనం.

చివరగా ఒక మాట. "స్వానుభవం వున్న రచయితలకే ఇక్కడి గ్రామ పార్టీల మూలాలను పట్టుకోవటం సాధ్యం" అని ఈ సంకలనం చివరనున్న ఒక వ్యాసంలో పాలగిరి విశ్వప్రసాద్ అంటారు. అది వాస్తవమే అయితే రచయితలందరికీ, ఇలాంటి స్వానుభవాలు సాధ్యం కాక పోవచ్చు. తమ ప్రాంతపు జీవిత నేపథ్యం నుండీ తమ సామాజిక అవగాహన నుండీ, స్పందన నుండీ, ఆర్తి నుండీ కూడా ఇలాంటి కథలు పుట్టుకొచ్చే అవకాశం లేకపోలేదు. కొన్ని 'మూస' కథలు ఉన్నప్పటికీ 'శిల్ప నిర్మాణం' సరిగా కుదరని కథలు కొన్ని ఉన్నప్పటికీ, ఒక 'ఒరవడి'లో నడచిన కథలు కొన్ని ఉన్నప్పటికీ, సీమ రచయితలుగా తమ కర్తవ్యాలను నెరవేర్చటానికి, కథకులు సాధించిన కథనకృషి తక్కువేమీకాదని ఈ సంకలనం నిరూపిస్తుంది.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ కలశపూడి శ్రీనివాసరావు గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.